రైతుల పాలిట కల్పవృక్షాలు - మన గుంటూరు కోల్డ్ స్టోరేజీలు

Advt Special Feature

మూడు దశాబ్దాల తర్వాత అ'పూర్వ' కలయిక


గురువులను సత్కరిస్తున్న పూర్వ విద్యార్థులు

గుంటూరు మెడికల్: తాడికొండ భగవాన్ శ్రీ సత్య సాయిబాబా జూనియర్ కళాశాలలో 1990-92లో ఇంటర్ బైపీసీ చదివిన విద్యార్థులు 31 సంవత్సరాల తరువాత సోమవారం గుంటూరులోని ఏపీ ఎన్జీవో అసోసియేషన్ హాలులో కలుసుకున్నారు. విద్యాభ్యాసం అనంతరం వివిధ వృత్తుల్లో, దేశ, విదేశాల్లో స్థిరపడి బిజీ లైఫ్‌లో జీవనం సాగిస్తున్న పూర్వ విద్యార్థులంతా ఒకచోట సమావేశమై కాలేజీ జ్ఞాపకాల్ని నెమరువేసుకున్నారు. ఏపీ ఎన్జీవో గుంటూరు నగర అధ్యక్షుడు ఎస్.పి.ఎస్. సూరి ఆధ్వర్యంలో జరిగిన ఆత్మీయ కలయికలో వారికి విద్యా బోధన చేసిన గురువులు, కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత పాపినేని శివశంకర్, కెమిస్ట్రీ లెక్చరర్ శంకరావును ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు నల్లయ్య, సుబ్బారావు, పతంజలి, సాంబిరెడ్డి, సుధాకర్, పద్మజ, అరవింద, నందకుమారి, విజయలక్ష్మి పాల్గొన్నారు.

క్లాత్ బ్యాంకు ప్రారంభం


బ్యాంకును ప్రారంభిస్తున్న మేయర్ కావటి, కమిషనర్ కీర్తి చేకూరి

నెహ్రూనగర్: క్లాత్ బ్యాంక్‌లు పేదలకు ఉపయోగకరంగా ఉండటంతో పాటు నగర పరిశుభ్రతకు కూడా దోహదపడుతాయని మేయర్ కావటి శివనాగమనోహర్ నాయుడు తెలిపారు. నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో సోమవారం లక్ష్మీపురం ఈ-బస్ బే వద్ద ఏర్పాటు చేసిన క్లాత్ బ్యాంకును నగర కమిషనర్ కీర్తి చేకూరితో కలసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ నగర ప్రజలంతా వాడని వస్త్రాల్ని క్లాత్ బ్యాంక్‌లకు అందజేయాలని కోరారు. బ్యాంకులో ప్రతి రోజు ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 8 గంటల వరకు నగర పాలక సంస్థ సిబ్బంది అందుబాటులో ఉంటారని తెలిపారు. కార్యక్రమంలో కార్పొరేటర్ ఈచంపాటి వెంకటకృష్ణ, ఈఈ సుందరరామిరెడ్డి, ఎంహెచ్‌ఓ భానుప్రకాష్, ఏడీహెచ్ రామారావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.

ప్రజల సమస్యలకు నిర్దేశిత గడువులోగా పరిష్కారం

కమిషనర్ కీర్తి చేకూరి

నెహ్రూనగర్: స్పందన కార్యక్రమంలో ప్రజల నుంచి అందే ఫిర్యాదుల్ని నిర్దేశిత గడువులోగా పరిష్కరించాలని అధికారులకు నగర కమిషనర్ కీర్తి చేకూరి స్పష్టం చేశారు . నగరపాలక సంస్థ కాన్ఫరెన్స్ హాలులో సోమవారం స్పందన నిర్వహించారు. ప్రజల నుంచి ఆమె స్థానిక సమస్యలపై ఫిర్యాదుల్ని స్వీకరించారు. మొత్తం 59 ఫిర్యాదులు అందాయి. ఇందులో పట్టణ ప్రణాళిక విభాగానికి 15, ఇంజినీరింగ్ విభాగానికి 18, ప్రజారోగ్య విభాగానికి ఆరు, రెవెన్యూ విభాగానికి తొమ్మిది, ఉపా సెల్ విభాగానికి మూడు, అకౌంట్స్ విభాగానికి ఆరు, పరిపాలన విభాగానికి రెండు చొప్పున ఫిర్యాదులు అందాయి. వాటిని త్వరితగతిన పరిష్కరించాలని ఆమె అధికారుల్ని ఆదేశించారు. కార్యక్రమంలో నగరపాలక సంస్థ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

రోగులకు మజ్జిగ పంపిణీ

గుంటూరు మెడికల్: కోవిడ్ ఫైటర్స్ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో సోమవారం గుంటూరు జీజీహెచ్ వద్ద రోగులు, సహాయకులకు ఉచితంగా మజ్జిగ పంపిణీ చేశారు. వేసవి దాహార్తిని తీర్చేందుకు దాతల సహాయంతో 1500 మందికి మజ్జిగ పంపిణీ చేసినట్లు ట్రస్టు నిర్వాహకులు పఠాన్ అల్లాబక్షు తెలిపారు.

అగస్త్యేశ్వరుని ఆలయంలో అన్నదానం

పట్నంబజారు: మహా శివరాత్రి ముగిసి 16 రోజులు అయిన సందర్భంగా సోమ వారం పాత గుంటూరులోని శ్రీగంగా పార్వతీ సమేత అగస్త్యేశ్వరస్వామి ఆలయంలో సోమవారం అన్నదానాన్ని నిర్వహించారు. నగర మేయర్ కావటి మనోహర్‌నాయుడు, వైఎస్సార్ సీపీ తూర్పు నియోజకవర్గ మహిళ నేత షేక్ నూరిఫాతిమా పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్నదానాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ మాదాసు మాధవ, కార్పొరేటర్ ఇర్రి ధనలక్ష్మి, పార్టీ నేతలు పాల్గొన్నారు.

సైకిల్ తొక్కడంతో వ్యాధులు దూరం


ర్యాలీని ప్రారంభిస్తున్న డీఎంహెచ్‌ఓ

గుంటూరు మెడికల్: ప్రతి రోజూ సైకిల్ తొక్కడం ద్వారా పలు రకాల వ్యాధులు రాకుండా కట్టడి చేయవచ్చని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ అమర్తలూరి శ్రావణ్‌బాబు సూచించారు. వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ నివాస్ ఆదేశాల మేరకు సోమవారం స్థానిక గుండారావుపేట పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో 'సైకిల్ ఫర్ హెల్త్' నినాదంతో ర్యాలీ నిర్వహించారు. ర్యాలీని స్థానిక కార్పొరేటర్ పద్మావతి ప్రారంభించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌ఓ మాట్లాడుతూ సైకిల్ వ్యాయామంతో క్యాన్సర్ వ్యాధిని అరికట్ట వచ్చని చెప్పారు. అధిక బరువు, రక్తపోటు, మానసిక ఒత్తిడిని అధిగమించవచ్చని తెలిపారు. కార్యక్రమంలో పట్టణ వైద్యాధికారి డాక్టర్ హామీద, జిల్లా మాస్ మీడియా అధికారి ఏ. జయప్రసాద్, ప్రధానోపాధ్యాయుడు పి. శ్రీనివాస్, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి



పట్నంబజారు: స్థానిక ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో నూతనంగా నిర్మిస్తున్న ఓ క్యాంటిన్ పరిసర ప్రాంతంలో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెంది ఉన్నాడు. వయస్సు 40 సంవత్సరాలు ఉంటుంది. స్థానికులు సోమవారం గమనించి పాత గుంటూరు పోలీసులకు సమాచారం అందించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతుడి వివరాలు తెలిసిన వారు 9182529219 నంబర్‌కు సమాచారం అందించాలని ఎస్ఐ వెంకట్రావు కోరారు.

రైతులకు ప్రయోజనకరంగా కోల్డ్ స్టోరేజీలు

కొరిటిపాడు(గుంటూరు): గతంలో పంటల్ని నిల్వ చేసుకోవాలంటే రైతులు అనేక కష్టాల్ని చవి చూసేవారు. చేసేది లేక ఇళ్లల్లో, పొలాల్లోనూ జాగ్రత్తగా భద్రపరచుకునేవారు. అక్కడ దాచిన పంట కీటకాలు, ఇతరత్రా మూషికాల బారినుంచి కాపాడుకునేందుకు అనేక అవస్థల్ని ఎదుర్కొనేవారు. క్రమేణా రైతులు ఆ బాధలు నుంచి బయటపడ్డారు. చేలో పంట ఏవిధంగా ఉందో.. నెలలు గడిచినా, అమ్మే వరకు శీతల గిడ్డంగులు (కోల్డ్ స్టోరేజీ) భద్రంగా దాచేందుకు సిద్ధంగా ఉన్నాయి. గుంటూరు జిల్లాలో సుమారు 120కి పైగా శీతల గిడ్డంగులు ఉన్నాయి. గుంటూరు నగరానికి అనుసంధానంగా సుమారు 82 శీతల గిడ్డంగులు రైతులకు అందుబాటులో ఉన్నాయి.

నాణ్యమైన సౌకర్యాలు

శీతల గిడ్డంగుల్లో గుంటూరు జిల్లాతోపాటు ఇతర జిల్లాల్లోని రైతులు సరుకు భద్రపరుచుకునేందుకు యజమానులు నాణ్యమైన సౌకర్యాలు కల్పించారు. విశాలమైన గదులు, లిఫ్ట్, రైతులు బస చేసేందుకు వీలుగా విశ్రాంతి గదులు, తక్కువ ధరలకే బస్తాలను అద్దెకు భద్రపరుచుకునేలా ఏర్పాట్లు ఉన్నాయి. దీంతో గుంటూరు నగర శివారు ప్రాంతాలతో పాటు కర్నూలు, అనంతపురం, కృష్ణా, ప్రకాశం, నెల్లూరు జిల్లాలు, తెలంగాణ రాష్ట్రంలోని ఖమ్మం జిల్లా, కర్ణాటక రాష్ట్రంలోని బళ్లారి నుంచి రైతులు మిర్చిని విక్రయించుకునేందుకు ఇక్కడ శీతల గిడ్డంగుల్ని ఆశ్రయిస్తుంటారు. వారి రాకతో గిడ్డంగులు నిండుకుండలా మారుతున్నాయి. చాలా గిడ్డంగుల్లో యజమానులు రైతులకు మరిన్ని సౌకర్యాలను కల్పించడంలో ముందంజలో ఉంటున్నారు. కొందరైతే ఏకంగా రుణాలు సైతం ఇప్పిస్తున్నారు. వ్యవసాయ మార్కెట్ యార్డుకి తీసుకొచ్చిన సరుకు ఏదైనా అమ్మకం జరగకపోయినా వెంటనే గిడ్డంగుల్లో అరబెట్టేందుకు అవకాశాలు కల్పిస్తున్నారు. దీనికితోడు శీతలీకరణ (ఏసీ) నిర్వహణ బేషుగ్గా నిర్వహిస్తున్నారు. 6 నుంచి 8 డిగ్రీల వరకు నిర్వహిస్తుండటంతో పంట చెక్కు చెదరడం లేదు.

తక్కువ ధరలకే నిల్వ సౌకర్యం

రైతుల శ్రమను దృష్టిలో ఉంచుకుని అతి తక్కువ ధరలకే పంటను గిడ్డంగుల్లో నిల్వ చేసుకునే అవకాశం కల్పిస్తున్నాం. దీనికితోడు సరుకు పాడవకుండా నాణ్యత ప్రమాణాల్ని పాటిస్తున్నాం.

–తడకమళ్ల సూర్యప్రకాశరావు,
ది కోల్డ్‌స్టోరేజీ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు

నేడు జనరిక్ మందులపై అవగాహన

గుంటూరు మెడికల్: జన ఔషధి దివస్‌ను పురస్కరించుకుని మంగళవారం ఆత్మకూరు నిర్మలా ఫార్మసీ కళాశాలలో జనరిక్ మందులపై అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు ఔషధ నియంత్రణ, పరిపాలన శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ దోనవల్లి లక్ష్మణ్ తెలిపారు. ఉదయం 9.30 గంటలకు సదస్సు ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని ముఖ్య అతిథిగా పాల్గొని జనరిక్ మందులపై ప్రజలకు, ఔషధ విక్రేతలకు అవగాహన కల్పిస్తారని తెలియజేశారు. ఇంకా రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ ముఖ్య కార్యదర్శి ఎం.టి.కృష్ణబాబు, డ్రగ్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ డైరెక్టర్ జనరల్ ఎస్.రవిశంకర్ నారాయణ సదస్సులో మాట్లాడతారని వెల్లడించారు. ప్రతి ఒక్కరూ సదస్సుకు హాజరై విజయవంతం చేయాలని లక్ష్మణ్ కోరారు.

రోడ్లు, కాల్వల నిర్మాణాలకు శంకుస్థాపన

పట్నంబజారు: మూడో డివిజన్ బాలాజీనగర్ 11వ లైనులో రూ. 17 లక్షలతో నిర్మించనున్న సీసీ రోడ్లు, సైడు కాల్వల నిర్మాణానికి సోమవారం కార్పొరేటర్ పోలవరపు జ్యోతి, తూర్పు నియోజకవర్గ మహిళా నేత షేక్ నూరిఫాతిమా శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నేతలు పోలవరపు వెంకటేశ్వరరావు, స్వర్ణ, మస్తాన్‌బీ, సాంబశివరావు, రఘు, గోపి, రాంబాబు, బ్రహ్మనాయుడు, గిరి, లీలాకృష్ణ, బ్రహ్మరెడ్డి పాల్గొన్నారు.

వ్యక్తి ఆత్మహత్య

గుంటూరు ఈస్ట్: వ్యక్తి ఆత్మహత్యపై నగరంపాలెం పోలీసులు కేసు నమోదు చేశారు. వికలాంగుల కాలనీ 1వ లైనుకు చెందిన ఎస్.చంద్రశేఖర్ (36) మద్యానికి బానిసయ్యాడు. మూడు నెలలుగా మతిస్థిమితం కోల్పోయాడు. ఈనెల 4న ఒంటిపై పెట్రోలు పోసుకుని నిప్పంటించుకున్నాడు. పోలీసులు మృతదేహాన్ని మార్చురీకి తరలించారు.

జీజీహెచ్‌లో బోధకాలుకు ఉచితంగా ఆపరేషన్లు


ఆపరేషన్లు చేయించుకున్న వారితో వైద్యులు

గుంటూరు మెడికల్: గుంటూరు జీజీహెచ్‌లో బోధకాలుకు ఉచితంగా ఆపరేషన్లు చేస్తున్నారు. గతంలో మాదిరిగా కాళ్లను, ఇతర శరీర అవయవాలను తీసుకొచ్చి రోగుల్ని జనజీవన స్రవంతిలో వారు కలిసేలా చేశారు. సోమవారం ప్రపంచ లింఫోడెమా దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్లాస్టిక్ సర్జరీ వైద్య విభాగంలో బోధకాలు, ఇతర శరీర అవయవాలకు ఆపరేషన్లు చేయించుకుని వ్యాధి సోకక ముందు మాదిరిగా శరీర అవయవాలను తీసుకొచ్చిన వైద్యులకు బాధితులు కృతజ్ఞతలు తెలిపారు. ముఖ్యంగా తమలో ఉన్న ఆత్మ నూన్యతా భావం తొలగిపోయేలా ర్యాంప్ వాక్ చేసి అందరిని ఆశ్చర్యానికి గురి చేశారు. ఈ సందర్భంగా ప్లాస్టిక్ సర్జరీ విభాగాధిపతి డాక్టర్ సుమితా శంకర్ మాట్లాడుతూ దోమకాటు ద్వారా సంభవించే ఎలిఫెంటియాసిస్‌కు శస్త్రచికిత్స లేదనే అపోహ అనేక మందిలో ఉందన్నారు. కోవిడ్ అనంతరం ఆపరేషన్లు ప్రారంభించామని, ఇప్పటి వరకు 15 విజయవంతంగా చేశామని తెలిపారు. సుమారు రూ. 3లక్షల ఖరీదు చేసే సూపర్ మైక్రో సర్జరీలను ఆరోగ్యశ్రీ ద్వారా పూర్తి ఉచితంగా చేశామని చెప్పారు. కార్యక్రమంలో అసిస్టెంట్ ప్రొఫెసర్లు డాక్టర్ నజ్మా, డాక్టర్ చంద్రలేఖ, డాక్టర్ భవాని, సీనియర్ రెసిడెంట్ డాక్టర్ సాధనాల నిశాంత్, డాక్టర్ కృతి, పాల్గొన్నారు.

ప్రమాదవశాత్తు వ్యక్తి కిందపడి మృతి

గుంటూరు ఈస్ట్: ప్రమాదవశాత్తు వ్యక్తి కిందపడి మృతి చెందిన ఘటనపై పట్టాభిపురం పోలీసులు కేసు నమోదు చేశారు. మారుతీనగర్ 5వ లైనుకు చెందిన చెరుకూరి వెంకటేశ్వర్లు డ్రైవింగ్ స్కూల్ నడుపుతుంటాడు. అపార్టుమెంట్‌లోని తన ఫ్లాట్‌లోకి వెళ్లి శుభ్రం చేస్తూ ప్రమాదవశాత్తు కిటిలో నుంచి కిందపడ్డాడు. వాచ్‌మెన్ సమాచారంతో అతని భార్య రమాదేవి ఘటనా స్థలానికి వెళ్లి భర్తను నగరంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించింది. వైద్యులు పరీక్షించి మృతి చెందినట్లు నిర్ధారించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నగరంలో భారీ వాహనాలకు అనుమతి లేదు

పట్నంబజారు: నిబంధనలకు విరుద్ధంగా ఉదయం 9 నుంచి రాత్రి 9 గంటల వరకు భారీ వాహనాలు నగరంలోకి ప్రవేశిస్తే ఉపేక్షించబోమని ఈస్ట్ ట్రాఫిక్ సీఐ ఎండీ.నిసార్ బాషా హెచ్చరించారు. ఆర్టీసీ బస్టాండ్, బ్రహ్మానందరెడ్డి స్టేడియం, కాకాని రోడ్డు, ఎత్తు రోడ్డు, సంగడిగుంట రోడ్డుతో పాటు పలు ప్రాంతాల్లో సోమవారం స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. నిబంధనలకు విరుద్ధంగా నగరంలో ప్రవేశించిన వాహనాలకు రూ. 26వేల జరిమానా విధించారు.

వృద్ధురాలి అదృశ్యం



గుంటూరు ఈస్ట్: వృద్ధురాలి అదృశ్యంపై పట్టాభిపురం పోలీసులు కేసు నమోదు చేశారు. కృష్ణనగర్‌లో నివసించే భానుమతి (75)ఈనెల 4న ఇంట్లో ఎవరికీ చెప్పకుండా ఎటో వెళ్లిపోయింది. ఆమెకు మూగ, చెవుడు ఉంది. భానుమతి సోదరుడు ఫణిదత్ ఆమె ఆచూకీ కోసం వెతికి, కనిపించకుండా పోయినట్లు నిర్ధారించుకుని సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు.